

ఆర్ఐ నిరంజన్‌కు వినతి పత్రం అందజేస్తున్న నేతలు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

కవాడిగూడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలులో రాజకీయ పార్టీలు నాటకాలు ఆడుతున్నాయని 42శాతం బీసీ రిజర్వేషన్ సాధన సమితి ముషీరాబాద్ మండల అధ్యక్షుడు గుడపర్తి సంతోష్‌కుమార్ ఆరోపించారు. ముషీరాబాద్ మండల తహసీల్దార్ కార్యాలయ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నిరంజన్‌కు సాధన సమితి నేతలు మంగళవారం వినతిపత్రం అందజేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని సంతోష్‌కుమార్, సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీని నెరవేర్చాలని చేయాలన్నారు. వివిధ పార్టీల్లో ఉన్న అగ్రవర్ణాలందరికీ రిజర్వేషన్లు అమలు కావడం ఇష్టంలేదని పేర్కొన్నారు. బీసీ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించి అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దెత్తున ఉద్యమాలు చేపడతామమని హెచ్చరించారు.



బస్తీ వాసులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు ముఠాజైసింహ, బీఆర్‌ఎస్ నేతలు

లింక్ బ్రిడ్జి ర్యాంప్ ఎత్తు తగ్గించాలి

కవాడిగూడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దోమలగూడ -అశోక్‌నగర్ లింక్ బ్రిడ్జి ర్యాంప్ ఎత్తును తగ్గించాలని బీఆర్‌ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు ముఠాజైసింహ అధికారులను కోరారు. ర్యాంప్ ఎత్తుగా ఉండటం వల్ల బస్తీలోకి రాకపోకలు సాగించేందుకు ఇబ్బందవుతోందని సూరజ్‌నగర్ బస్తీవాసులు, వివిధ అపార్ట్‌మెంట్ వాసులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా మంగళవారం ఈ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ విషయంలో బస్తీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. సూరజ్‌నగర్‌లో పబ్లిక్ టాయిలెట్లు, డ్రైనేజీ, సీసీరోడ్లు, విద్యుత్ సమస్యలను కూడా ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో కవాడిగూడ బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎన్‌డీ సాయికృష్ణ, బీఆర్‌ఎస్ నేతలు రాజశేఖర్‌గౌడ్, ప్రభాకర్, బస్తీవాసులు నర్సింహ, చందు, వేణుగోపాల్, సత్యనారాయణ, సంతోష్, హరీష్‌యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇందిరాపార్క్ వద్ద చేపట్టిన నిరసన దీక్షలో మాట్లాడుతున్న రెడ్డి సంఘాల నేతలు

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలుకు ప్రత్యేక కమిషన్

● తెలంగాణ రెడ్డి సంఘం నాయకుల డిమాండ్

కవాడిగూడ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై అసత్య ప్రచారాలు, కుట్రలను సహించబోమని దీనిపై ఓసీ సామాజిక వర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ రెడ్డి సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలు కోసం జాతీయ స్థాయిలో ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఓసీలకు కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. మంగళవారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద తెలంగాణ రాష్ట్ర రెడ్డి సంఘాల ఆధ్వర్యంలో రెడ్డి నిరసన దీక్ష చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర రెడ్డి సంఘాల నాయకులు అత్తమ్మగారి రాంరెడ్డి, ఏనుగు సంతోష్ రెడ్డి, పైళ్ల హరినాథ్‌రెడ్డి, వెంకటేశ్‌రెడ్డి, గోపు జైపాల్‌రెడ్డి ఓసీ సామాజిక సంక్షేమ సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు తదితరులు ప్రసంగించారు. అన్ని పోటీ పరీక్షలలో వయోపరిమితి సడలించి రెడ్డి కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి పాలకమండలి ఏర్పాటు చేయాలన్నారు. జనవరిలో లక్షమందితో ఓసీ సింహగర్జన సమరభేరి సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరసన దీక్షలో కాచం సత్యనారాయణ గుప్తా, మాధవరెడ్డి, సంజీవరెడ్డి, సత్యనారాయణరెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మహిళలు, రెడ్డి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ మేడి సురేష్ కుమార్ తదితరులు

ప్రత్యేక పూజలు

ముషీరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్‌దేవునితోట.. భవాని శంకర ఆలయంలో మంగళవారం సామూహిక దీపారాధాన, తదితర విశేష పూజలు నిర్వహించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని త్రిశూలం, నంది రూపంలో దీపాలను పేర్చి ఆలయ కమిటీ చైర్మన్ మేడి సురేష్ కుమార్ తదితరులు పూజలు చేశారు. బుధవారం స్వామికి అభిషేకాలు, సామూహిక సత్యనారాయణ వ్రతం, సాయంత్రం జ్వాలాతోరణం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఆర్ శ్రీనివాస్, ధర్మకర్తలు రాజు, నర్సింగ్‌రావు, ఆలయ సిబ్బంది సురేష్ పాల్గొన్నారు.

గుంతలను పూడ్చాలి

చిక్కడపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ చిక్కడపల్లి వివేక్‌నగర్ హనుమాన్ టెంపుల్ వీధి రోడ్డుపై గుంతలను పూడ్చి వేయాలని టీడీపీ డివిజన్ సీనియర్ నేత భవాని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రోడ్డుపై ఎక్కడ పడితే గుంతలు ఉన్నాయని దీంతో రాత్రిపూట వాహనచోదకులు అందులో పడిపోయి గాయాలపాలవుతున్నారన్నారు. వర్షం వచ్చిందంటే నీరు చేరడంతో చీకట్లో ఇవి కానరాక వాహనచోదకులు పడిపోతున్నారన్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు స్పందించి వీటిని పూడ్చాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

ముషీరాబాద్ అభివృద్ధికి ప్రాధాన్యం

● ఎమ్మెల్యే ముఠాగోపాల్

ముషీరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి.. రాజకీయాలకు అతీతంగా చేస్తున్నామని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. మంగళవారం ముషీరాబాద్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బల్వంత్ ఆధ్వర్యంలో పలువురు బీఆర్‌ఎస్ నేతలు ఆయన్ను కలిసి సమస్యలను వివరించారు. నియోజకవర్గంలో తాగునీరు, డ్రైనేజీ పైప్‌లైన్‌ల ఏర్పాటుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. పైప్‌లైన్ పనులు పూర్తయిన వెంటనే ఆయా ప్రాంతాల్లో రోడ్లు సైతం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బీఆర్‌ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నియోజకవర్గం మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బల్వంత్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మొద్దు

● అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అధికార కాంగ్రెస్, బీజేపీలు చెప్పే మాటలను నమ్మకుండా ప్రజల కోసం పనిచేసే బీఆర్‌ఎస్‌కు ఓట్లు వేసి గెలిపించాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కోరారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మూడు పర్యాయాలుగా ఎమ్మెల్యేగా దివంగత మాగంటి గోపినాథ్ అన్నివర్గాల సంక్షేమం, స్థానిక సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి చేశారని, ఉప ఎన్నికలో ఆయన సతీమణి మాగంటి సునీతకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. మంగళవారం పార్టీ నాయకులతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ విజయంతోనే జూబ్లీహిల్స్ నియోజకవర్గం సమగ్రాభివృద్ధి, ప్రజాశ్రేయస్సు సాధ్యమన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రేడ పాక రాము తదితరులు పాల్గొన్నారు.



యూసుఫ్‌గూడలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

పుస్తె, మట్టెలు.. పట్టుచీర అందజేత

బర్కత్‌పుర, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నవ వధువు మన్నె శ్రీవర్ష కుటుంబ సభ్యులకు మంగళవారం పుస్తె మట్టెలు, పట్టు చీర అందజేశారు. ఆర్థికంగా వెనుకబడిన వారి వివాహం నిమిత్తం పుస్తె, మట్టెలు, పట్టు చీరను మహాసభ తరఫున అందజేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస రావు తెలిపారు. కాచిగూడ మున్నూరుకాపు భవన్‌లో మహాసభ పుస్తె, మట్టెల కన్వీనర్ దండు రవీందర్ ఆధ్వర్యంలో త్వరలో వివాహం కానుంది. కార్యక్రమంలో నాయకులు చంద్రకాంత్, వెంకటేశ్వర రావు, సతీష్, అజయ్‌కుమార్, మహేష్, రమేష్, దయానంద్, బండారు జ్యోతి, అన్నపూర్ణ, చామకూర సుజాత తదితరులు పాల్గొన్నారు.

సభ్యులందరికీ ప్రభుత్వ హెల్త్ కార్డులు

● తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ నేతల డిమాండ్

రాంనగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రియల్ ఎస్టేట్ అసోసియేషన్ సభ్యులందరికీ ప్రభుత్వం హెల్త్ కార్డులు మంజూరు చేయాలని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నారగోని ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి పగడాల రంగారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.నర్సయ్యలు డిమాండ్ చేశారు. మంగళవారం అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. హెల్త్ కార్డులు ఇవ్వాలని ఈ నెల 18న ప్రజాప్రతినిధులకు వినతిపత్రాల సమర్పణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. హెచ్ఎండీఏ, డీటీసీపీ బిల్డింగ్‌ల అనుమతి కోసం 100 రోజుల్లో అనుమతి ఇచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్‌కు చెందిన వివిధ జిల్లాల నాయకులు రమేష్, లక్ష్మణ్‌రావు, రత్నాకర్‌రెడ్డి, శ్రీనివాస్, మహ్మద్, చంద్రారెడ్డి, రాజేష్, యాదగిరి, గోపాల్‌రెడ్డి, కృష్ణారావు, కె.సుధాకర్, సోమయ్య, శంకర్‌గౌడ్, అబ్దుల్ ఆలీం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నారగోని ప్రవీణ్, రంగారావు, నర్సయ్య తదితరులు

అంతర్జాతీయ క్రీడా సదస్సుకు బి.లక్ష్మయ్య



రాంనగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) డాక్టర్ బి.లక్ష్మయ్య.. శ్రీలంక రాజధాని కొలంబోలో ఈ నెల 6, 7వ తేదీల్లో జరిగే అంతర్జాతీయ క్రీడా సదస్సుకు ఎంపికయ్యారు. క్రీడల అభివృద్ధిలో మీడియా పాత్ర అనే అంశంపై పరిశోధన పత్రం సమర్పించనున్నారు. ప్రస్తుతం ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఈ అంతర్జాతీయ సదస్సులో పాల్గొనేందుకు తన అవకాశం రావడం సంతోషంగా ఉందని లక్ష్మయ్య అన్నారు. ఆయనను ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.సోమేశ్వరరావు, డిగ్రీ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బాలరాజు తదితరులు సత్కరించారు.



సమావేశంలో బీజేపీ నాయకుడు కనకేష్ కుమార్, నర్సింహ

జూబ్లీహిల్స్ గెలుపుపై బీజేపీ ధీమా

ముషీరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం ఖాయమని పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బిజ్జి కనకేష్‌కుమార్, రాష్ట్ర దళితమోర్చా ఉపాధ్యక్షుడు నందగిరి నర్సింహ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం వెంగళరావ్‌నగర్ డివిజన్‌లో బీజేపీ అభ్యర్థి లంకల దీపాక్‌రెడ్డికి మద్దతుగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతంరావు నిర్వహించిన సమావేశానికి భోలక్‌పూర్ నుంచి పెద్దెత్తున పార్టీ నాయకులు తరలివెళ్లారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా బీజేపీ విజయం సాధిస్తున్నదని జూబ్లీహిల్స్‌లోనూ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు రాజశేఖర్, డివిజన్ నాయకులు శ్రీనివాస్, బ్రహ్మచారి, మహేష్, శివకుమార్, విజయ్ కుమార్, వెంకటసాయి తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల హక్కుల కోసం రాజీలేని పోరాటం

● ప్రణాళిక ప్రకారం సేవా కార్యక్రమాలు
● తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రమణారావు



మాట్లాడుతున్న బ్రాహ్మణ సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రమణారావు తదితరులు


నల్లకుంట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో బ్రాహ్మణుల న్యాయమైన హక్కుల సాధన కోసం రాజీలేని పోరాడుతున్నామని తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు పేర్కొన్నారు. మంగళవారం నల్లకుంటలో ఉన్న సంఘం కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కానాల శ్యాంసుందర్‌రావు అధ్యక్షతన సమావేశం జరిగింది. బ్రాహ్మణుల కోసం వివిధ సేవా కార్యక్రమాలను ప్రణాళికబద్ధంగా అమలుకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లాల వారీగా బ్రాహ్మణ సంఘం కార్యావర్గాల నియామక ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. సంఘాన్ని విస్తరింపజేసి మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. యువతలో బ్రాహ్మణ సాంస్కృతిక వారసత్వం, సంప్రదాయాలు, సేవాభావం పట్ల అవగాహన పెంపొందించనున్నట్లు తెలిపారు. ఈ నెలలో భువనగిరిలో కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని అన్ని బ్రాహ్మణ సంఘాల సమన్వయంతో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్ సేవా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక సేవా ప్రాజెక్టుల రూపకల్పన చేయనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో బ్రాహ్మణ సమాజ ఐక్యత, సేవా స్ఫూర్తి, అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నూరి లక్ష్మీనరసింహారావు, నాయకులు ఉరే ప్రసాద్‌రావు, గూడ రాజేశ్వరరావు, చెన్నూరి రాధాకృష్ణన్‌రావు, ప్రగడ శ్రీకాంత్, గూడ జయరాం తదితరులు పాల్గొన్నారు.



సంజయ్ రతన్‌కు సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న కరాటే కోచ్ శ్రీకాంత్

వ్యాసరచనలో విద్యార్థి ప్రతిభ

నల్లకుంట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వ్యాస రచన పోటీల్లో విద్యార్థి సంజయ్ రతన్ ప్రతిభ చూపాడు. రాష్ట్ర ప్రభుత్వ ముద్రణాలయ (సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ హైదరాబాద్) ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ఖైరతాబాద్.. ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి రతన్ తృతీయ బహుమతి పొందాడు. సర్టిఫికెట్, రూ. 1500 నగదు అందజేశారు. కరాటేలో శిక్షణ పొందుతున్న సంజయ్ రతన్‌కు కరాటే కోచ్ శిహాన్, శ్రీకాంత్‌లు అకాడమీలో సర్టిఫికెట్ ప్రదానం చేసి మంగళవారం అభినందించారు.



మాట్లాడుతున్న నిపుణుడు డాక్టర్ అమీర్

చర్చలతోనే విభేదాల పరిష్కారం

● నిపుణుడు డాక్టర్ అమీర్

రాంనగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు, యువకుల మధ్య తలెత్త విబేధాలు, కుటుంబ తగాదాలను పరస్పర గౌరవం, చర్చలతోనే పరిష్కరించుకోవాలని నాయకత్వ నిపుణుడు డాక్టర్ అమీర్ పేర్కొన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలో డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో "నాన్‌ఫ్లిక్ట్ రిజల్యూషన్ - ది ఆర్ట్ ఆఫ్ ఎవ్రిడే పీస్ మేకింగ్"పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ విద్యా సంస్థల లా కళాశాల ప్రిన్సిపాల్ సృజన, విఠలాచార్య, జి.సంతోష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లింగేశ్వరస్వామి వారికి పెరుగుతో అభిషేకం

చిక్కడపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో ఉన్న లక్ష్మీగణపతి దేవాలయం ఆవరణలో ఉన్న పార్వతీక్షీరలింగేశ్వరస్వామికి పెరుగుతో అభిషేకం నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు భారీగా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉమ్మడి రాష్ట్రాల యువత అధ్యక్షుడు సాయిబాబా

ఫీజు బకాయిలను విడుదల చేయాలి

● ఉమ్మడి రాష్ట్రాల యువత అధ్యక్షుడు సాయిబాబా

రాంనగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కాలేజీ యాజమాన్యాల ఫీజు బకాయిలను విడుదల చేసి కాలేజీల బంద్‌ను విరమింపజేయాలని దక్షిణమధ్య రైల్వే బోర్డు సభ్యుడు, ఉమ్మడి రాష్ట్రాల యువత అధ్యక్షుడు కె.సాయిబాబా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల ఫీజు బకాయిలను ప్రభుత్వం విడుదల చేయకపోవడం వల్ల యాజమాన్యాలు బంద్‌ను నిర్వహిస్తున్నాయని, దీంతో విద్యార్థులు విలువైన సమయాన్ని కోల్పోతున్నారని పేర్కొన్నారు. మంగళవారం విద్యానగర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో 600 కోట్ల రూపాయలను విడుదల చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్కలు చర్యలు తీసుకోవాలన్నారు. ఫీజులు చెల్లించకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. కొన్ని కాలేజీలో పనిచేసే అధ్యాపకులకు జీతాలు చెల్లించడం లేదన్నారు. వెంటనే ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అజార్‌గల్లీలో తాగునీటి సమస్యకు చెక్!

ముషీరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ అజార్‌గల్లీలో నెలకొన్న తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కొత్త పైప్‌లైన్‌లు ఏర్పాటు చేస్తున్నామని బీఆర్‌ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ముషీరాబాద్ డివిజన్‌లోని అజార్‌గల్లీలో రూ.2.40లక్షలతో చేపడుతున్న పైప్‌లైన్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్‌కు స్థానిక ప్రజలు పలుమార్లు విజ్ఞప్తి చేయగా నిధులు మంజూరు చేయించారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పూసగోరక్‌నాథ్, ముత్యం బాలరాజు గౌడ్, నరేష్ రెడ్డి, ధనలక్ష్మి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



నూతన పైప్‌లను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నేతలు

రిబేట్‌పై చేనేతవస్త్రాలు

చిక్కడపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోఆప్టెక్స్ వస్త్ర షోరూమ్‌లో చేనేత వస్త్రాలపై 30 శాతం రిబేట్‌పై అమ్మకాలు నిర్వహిస్తున్నట్లు షోరూమ్ ఇన్‌చార్జి ఎ. వీరయ్య తెలిపారు. మంగళవారం షోరూమ్‌లో విలేకరులతో మాట్లాడారు. తమిళనాడు ప్రభుత్వం ఆధీనంలో నిర్వహించబడుతున్న ఈ షోరూమ్‌ను మార్చిలో ఆధునీకరించి తమిళనాడు చేనేత శాఖ మంత్రితో ప్రారంభించామని వివరించారు. దసరా, దీపావళి నుంచి ప్రారంభమైన ఈ ప్రత్యేక రిబేట్ ఆఫర్ సంక్రాంతి వరకు కొనసాగుతోందన్నారు. ఈ సౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్యారెంటీలను విస్మరించిన కాంగ్రెస్

చిక్కడపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారెంటీలను అమలు చేసే అంశాన్ని కాంగ్రెస్ ఎప్పుడో మర్చిపోయిందని, పదేళ్ల పాలనలో బీఆర్‌ఎస్ ప్రజలకు చేసిందేమీ లేదని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్ విమర్శించారు. బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి తరఫున ఆయన ఆధ్వర్యంలో విస్తృతంగా పాదయాత్ర నిర్వహిస్తున్నారు. మంగళవారం సాయంత్రం గాంధీనగర్ కార్పొరేటర్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల పట్ల ప్రజలు ఆకర్షితులవుతున్నారని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరుగుతున్న బీజేపీ ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఆరుగురికి జైలుశిక్ష

● 31 మందికి జరిమానా

చిక్కడపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలను నడిపిన వారికి జడ్జి.. జైలుశిక్ష, జరిమానా విధించారు. చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏడుకొండలు తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించగా.. ఇందులో పట్టుబడిన 37 మందిని నాంపల్లి కోర్టులో మంగళవారం హాజరుపరిచారు. వారిలో 31 మందికి జరిమానా విధించారు. ఆరుగురికి ఆరు రోజుల జైలు శిక్ష, జరిమానాను జడ్జి విధించారు. మొత్తం రూ.లక్ష 21వేల 300లు జరిమానా కట్టారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఆ నిబంధన ఎత్తేయాలి

చిక్కడపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎకరానికి 7 క్వింటాళ్ల పత్తే కొంటామనే నిబంధనను ఎత్తేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్ డిమాండ్ చేశారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో ఉన్న తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడు క్వింటాళ్లు కొంటామనే పరిమితి పెట్టడం సరికాదన్నారు. ఇదిలా ఉండగా పత్తిని తేమ పేరుతో కొనుగోలు కేంద్రాల నుంచి తిప్పి పంపడం వల్ల ప్రైవేట్ వ్యాపారస్తులకు మద్దతు ధర కంటే తక్కువగా అమ్ముకుంటున్నారన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగారెడ్డి, ప్రొ. అరిబండి ప్రసాదరావు పాల్గొన్నారు.



బీజేపీ జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డికి మద్దతుగా అంబర్‌పేట బీజేపీ నాయకుడు దాసోజు నాగభూషణం చారి తదితరులు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.
అంబర్‌పేట, ఆంధ్రజ్యోతి